# శిక్ష

డి. కామేశ్వరి

లక్ష్యం ఏమైనా సాధనాలు ఉత్తమమైనవి కాకపోతే సత్ఫలితాలు చేకూరవు. తోడిమానవులకు తోడ్పడడంకన్న ఉత్తమమైన కార్యం వేరొకటి లేదు. అయితే అందుకు అవలంబించే పద్ధతులు ఆక్షేపణీయాలు కాకూడదు. అందునా రహస్యాన్ని ఆశ్రయించడంవల్ల మొదటికే మోసం వచ్చినా రావచ్చు. రహస్యాలు మానవ సంబంధాలను ఎంతమట్టుకు కలుషితం చేయగలవో చెప్పడం కష్టం.

నీరెండల సాయంకాలం.

'అన్నపూర్ణ అనాథ శరణాలయం' తెల్లని గేటు మీద సూర్యకిరణాల కాంతి ధగధగా మెరుస్తూంది. అంతకంటె మెరుస్తున్న నల్లని పెద్దకారు ఒకటి తెరిచిఉన్న గేటులోంచి దూసుకువచ్చింది. బాట కిరువైపులా ఉన్న రకరకాల పైజా మొక్కల్లాగే రకరకాల పైజుల్లో పిల్లలు నిలబడి చేతులు జోడించారు.

కారు తిన్నగా పోర్టికోలోకి వచ్చి ఆగింది. మానేజరు స్వయంగా తెరిచిన తలుపులోంచి నల్లటి ఉలెన్‌పాంటు, తెల్లటి జోధ్‌పురీ కోటులో, చేతికర్రతో హుందాగా ఉన్న మాజీ జమీందారు రంగారావుగారు, ఆవెనకే ఖరీదయిన దుస్తులతో అధునికంగా తయారయిన మెరుపుతీగలాంటి శ్యామలాదేవి దిగారు.

అక్కడ చేరిన గుమాస్తాలు, పిల్లలు, నౌకర్లు పెట్టిన నమస్కారాలు అందుకుంటూ మానేజరు దారితీయగా అనాథ శరణాలయం అంతా తిరిగి చూశారు. పిల్లల గదులు, వంటశాలలు, భోజనశాలలు, ప్రార్థనామందిరం, గార్డెను అంతా తిరుగుతూ, చెయ్యవలసిన మార్పులు, ఉంచవలసిన రీతులు చెబుతూ, మానేజరు కావాలని చెబుతున్నవాటికి తలఊపుతూ, అన్నీ తిరగడం పూర్తిఅయ్యాక, విశాలమైనచోట గార్డెనులో ఏర్పాటుచేసిన సభలో కూర్చున్నారు. వెంటతెచ్చిన బట్టలు, పళ్లు, మిఠాయిలు పిల్లలందరికీ శ్యామలాదేవి పంచి ఇచ్చింది. రంగారావుగారు పిల్లలందరిని బుద్ధిగా చదువుకోమని, మంచి పౌరులు కావాలని ఉద్బోధించారు. తరవాత మానేజరు దారి తీయగా ఆఫీసు రూములోకి వెళ్లి జమాఖర్చులు, ఆదాయాలు, ఇతర లెక్కలు తనిఖీ చెయ్యడంలో మునిగిపోయారు. ఆ పరిశీలన ఇప్పుడే ముగియదని, అలాంటి అవకాశంకోసమే ఎదురుచూస్తున్న శ్యామలాదేవి నెమ్మదిగా శరణాలయం లోపలి గదుల్లోకి దారి తీసింది. వెంట ఆయా పున్నమ్మకూడా నడిచింది.

"పున్నమ్మా, బాగున్నావా?" నడుస్తూ నెమ్మదిగా అడిగింది శ్యామల.

"ఏదోనమ్మా, ఇలా పడిఉన్నాను. పసివాళ్లను చూస్తూ వాళ్లతో ఆడుతూ పాడుతూఉంటే రోజులు దొర్లిపోతాయి!" నిమిషం ఆగి శ్యామలవంక ఆప్యాయంగా చూసి, "అమ్మా, మిమ్మల్ని చూస్తే నాకెంత సంతోషమో తెలుసా? నా చేతుల్లో ఇక్కడే పెరిగి పెద్దయిన మీరు ఈనాడు ఇంత ఉచ్చస్థితిలో ఉన్నారంటే ... ఎంత అదృష్టవంతురాలివి, తల్లీ! ఎంతమందికి ఉంటుంది ఇలాంటి అదృష్టం?!" అంది.

శ్యామల ముఖంలోకి ఒక్కసారి రక్తం పొంగి సిగ్గుపడింది. "అవును, పున్నమ్మా! తలుచుకుంటే అంతా ఆశ్చర్యంగా ఉంటుంది. ఎక్కడ నేను! ఎక్కడ జమీందారుగారు! అనాథగా పెరిగిన చోటుకే ఈనాడు యజమానురాలుగా వచ్చానంటే అదంతా జమీందారుగారి ఔదార్యానికి చిహ్నం!"

"అవునమ్మా! ధర్మప్రభువులు..." అంటూ నర్సరీలోకి దారితీసింది పున్నమ్మ.

బేబీకాట్స్‌లో కూర్చుని కొందరు ఆడుకుంటున్నారు. నడక వచ్చిన పిల్లలు కొందరు అటూ, ఇటూ నడుస్తున్నారు. మరీ చిన్నపిల్లలు కొందరు నిద్రపోతున్నారు. రకరకాల వయస్సులలో వెలిసి పిల్లలనుంచి నాలుగైదు ఏళ్లదాకా ఉన్నారక్కడ. అలా పరసగా చూసుకుంటూవెళ్లి ఒక బేబీకాట్ దగ్గిర ఆగిపోయింది శ్యామల ముద్దులొలుకుతూ, బొద్దుగా తెల్లగా ఉన్న ఓ రెండేళ్ల పాపను చూడగానే శ్యామల ముఖంలోకి ఒక్కసారిగా కాంతి వచ్చినట్లయింది ఆ పాపను ఎత్తుకుని ముద్దుపెట్టుకుంటూ, "పున్నమ్మా, ఈ పాప చాలా ముద్దుగా ఉంది కదూ!" అంది.

"అవునమ్మా, ఎవరి పిల్లో? ఆ తల్లికి చేతులెలా వచ్చాయో, ఇలాంటి బంగారుబొమ్మని ఇలా దిక్కులేనిదానిలా పారేయడానికి?"

శ్యామల ముఖం వివర్ణమయింది. "ఇలాంటి పిల్లని ఇలా అనాథగా వదిలివేయవలసివచ్చిన ఆ తల్లి ఎంత దురదృష్టవంతురాలో! ఎంత బాధపడిందో ఆమె మనసు!" ఆమె కళ్లలో నీరు చిమ్మింది.

"మీ మనసు మెత్తనగాని, ఒళ్లూ పైతెలియకుండా ప్రవర్తించి, వాళ్ల పాపఫలాన్ని ఇలా నడివీథిపాలు చేసినవాళ్లకి బాధ ఉంటుందా, అమ్మా! పాపం, పసిగుడ్డు తెల్లవారుజామున వీథి వరండాలో ఏడుస్తూ కనపడింది. అందుకే మానేజరుగారు ఉష అని పేరు పెట్టారు. ఎంత ముద్దులు మూటకడుతూందో చూడండి! ఎవరో పెద్దింటి పిల్లలాగానే ఉంది! పాపిష్ఠి తల్లి చేసిన పనికి శిక్ష అనుభవిస్తుంది!"

శ్యామల ఇంక వినలేకపోయింది. ఆ మాటలు ఆమెలో సూటిగా గుచ్చుకున్నాయి. పిల్లను పున్నమ్మకు ఇచ్చి భారంగా ముందుకు నడిచింది.

* * *

అన్నపూర్ణ అనాథ శరణాలయం రంగారావుగారి తాతగారి కాలంలో ఆయన భార్యపేర కట్టించినది. అప్పట్లో కేవలం దిక్కులేని పిల్లలకు ఆశ్రయం కల్పించేదిగా మాత్రం ఉండేది. తరవాత రంగారావుగారి తండ్రిగారి హయాంలో ఇంకా ఎక్కువ వసతులు, సదుపాయాలు సమకూర్చారు. ఉచితంగా మెట్రిక్ వరకు చదివించి, తరవాత వాళ్లకో దారి అంటూ ఏర్పడేదాకా అక్కడే ఉండేటట్టు ఏర్పాటుచేశారాయన.

కాలక్రమాన జమీందారీలు పోయి జమీందార్లకే భరణాలు ఏర్పడ్డాయి. వారితోబాటు వారి అనాథ శరణాలయానికికూడా కొంత ముట్టచెప్పేది ప్రభుత్వం. తాహతుకు మించినదే అయినా రంగారావుగారు ఆచారం ప్రకారం శరణాలయాన్ని సాధ్యమైనంత చక్కగా తీర్చిదిద్ది, అభివృద్ధిలోకి తేవాలని కృషి చేస్తున్నారు యాజమాన్యం వహించి.

రంగారావు నలభైఏళ్ల మనిషి. అజానుబాహువు దృఢమైన శరీరం. చూసేవాళ్లకు గౌరవం, మర్యాదతోపాటు హడలు పుట్టించేలాగ ఉంటారు. అంతకన్న ముఖ్యం, ఆయన మనసు ఒకోసారి వెన్నకన్న మెత్తపడితే, అవసరం వచ్చినప్పుడు వజ్రంకన్న గట్టిపడుతుంది. ఎంతటి ఔదార్యం, సహృదయత ఉన్నాయో, అంతటి పట్టుదల, మూర్ఖత్వం ఉన్నాయనిపిస్తుంది. పరువు ప్రతిష్ఠలకోసం ప్రాణం పెడతారు.

ఆయన మొదటి భార్యకూడా ఓ జమీందారు కూతురు. రెండు సంవత్సరాలక్రితం ఎనిమిది సంవత్సరాల కొడుకు, జమీందారు తమ్ముడు నారాయణరావులతో బాటు, ఘోరమైన కారుప్రమాదంలో చనిపోయింది. రంగారావుగారి తల్లి ఆ ఘోరవార్త విని స్పృహతప్పి, ఇంక ఆ తరవాత మళ్లీ కోలుకోలేక రోగంతో మంచమెక్కింది.

భార్య, కొడుకు పోయినతరవాత చాలాకాలం మతి చెడినట్లు ఉండేవారు రంగారావు. ఒక్కసారే అంతటి దుఃఖాన్ని తట్టుకునే శక్తి ఆయనకు లేకపోయింది. తరవాత తల్లి, ఇతరులు మళ్లీ పెళ్లి చేసుకోమని ఎన్నివిధాల చెప్పినా ఆయన వినిపించుకోలేదు. తమ వంశం ఈవిధంగా నిర్వంశం అయిపోతున్నందుకు ముసలి జమీందారిణి వ్యథచెంది ఎన్నివిధాలుగానో కొడుక్కి చెప్పి విఫలురాలైంది.

తన జీవితంలో ఏర్పడ్డ శూన్యాన్ని ఎలాగైనా మరిచిపోవాలన్న ప్రయాసతో ఊరు వదిలిపెట్టి ఎప్పుడూ మద్రాసులో తిరుగుతూండేవారు రంగారావు.

ఓ సాయంకాలం పరధ్యానంగా, వేగంగా కారు నడుపుతున్న రంగారావుకు శ్యామల కారుకింద పడబోవడంతో స్పృహ వచ్చింది. పక్కకు తిప్పి బ్రేక్ వేసినా, అప్పటికే శ్యామల కారుకింద పడడం, గాయపడడం జరిగిపోయాయి. ఆమెను వెంటనే తీసుకువెళ్లి ఓ ప్రైవేటు నర్సింగుహోములో చేర్పించారు. ఆమెను చూడగానే ఏదో తెలియని ఆకర్షణ కలిగింది ఆయనకు. నాజూగ్గా, పచ్చగా తీర్చిదిద్దినట్లున్న ఆ రూపు ఆయనను ఆకట్టుకుంది. తరవాత ఆమె ఆస్పత్రిలో ఉన్న ఇరవై రోజులు స్వయంగా వెళ్లి యోగక్షేమాలు విచారించేవారు. ఆ ఇరవై రోజులలో ఆయనకు శ్యామలతో ఎంతో సన్నిహితత్వం కలిగింది.

శ్యామల తను అన్నపూర్ణ అనాథ శరణాలయంలోనే పెరిగి పెద్దదయిందని, మెట్రిక్ పాసయి ఏదో ఉద్యోగం ఇంటర్వ్యూకోసం మద్రాసు వచ్చానని చెప్పాక రంగారావుగారికి ఎంతో ఆనందం కలిగింది.

తనలోని ఆలోచనలకు ఓ రూపు నిర్ణయించేలోగా, ముందు ఆమెను తనతోకూడా తన ఇంటికి తీసుకు వెళ్లడానికి నిశ్చయించుకున్నారు. ఇంటికి తీసుకువెళ్లి తల్లికి అప్పగించారు.

ఇంటికి వెళ్లిన కొద్ది నెలలకే జమీందారుగారు తన మనసులో మాట చెప్పినప్పుడు శ్యామల ఆశ్చర్య పడి, సందేహించింది; భయపడింది. జమీందారుగారి అభీష్టానికి ఎదురు చెప్పలేక, తన అదృష్టానికి ఆశ్చర్య పడుతూ ఆనందంతో, మనసూర్తిగా అంగీకరించింది. ముసలామె మొదట్లో ఒక అనాథ, జమీందారిణి కావడానికి అడ్డుచెప్పినా, కొడుకు మనస్తత్వం ఎరగడంమూలాన, భార్య పోయిన అతని వైరాగ్యంతో శ్యామల వచ్చాక ఎంత మార్పు వచ్చినదీ కళ్ల ఎదట చూడడంమూలాన, ఏదోవిధంగా కొడుకు సంతోషంగా ఉండడం, వంశం నిలబడడం కావాలని చివరికి ఒప్పుకుంది.

ఆనవాయితీ ప్రకారం సంవత్సరానికి ఒకసారి శరణాలయం వ్యవహారాలు చూడడానికి వెళుతున్న రంగారావుతోబాటు శ్యామలకూడా వెళ్లింది. అక్కడే ఓ అనాథగా పెరిగిన తను, ఇప్పుడు అధికారం హోదాలో వెళ్లడం సిగ్గు, సంకోచాలతోపాటు ఏదో గర్వాన్ని కూడా కలిగిస్తూంది.

అప్పుడే నర్సరీలో ఉన్న ఉషను చూసి ఏదో ఆలోచన రాగా, ఆమె విషయాలు గుచ్చి గుచ్చి అడగడం జరిగింది. ఏమిటో చెయ్యాలనుకుంది. కాని, ఆ సంగతి ఆయనతో పెళ్లి అయిన ఇంత కొద్దికాలంలో చెబితే ఏమను కుంటారో అన్న సంకోచం రాగా, అడిగే ధైర్యం చాలక ఊరుకుంది.

* * *

రాత్రి గదిలోకి వచ్చిన రంగారావు తన రాకనే గుర్తించనంత పరధ్యానంలో ఉన్న శ్యామలను చూసి ఎంతో ఆశ్చర్యపడ్డారు. ఎప్పుడూ సంతోషంగా కలకల లాడే శ్యామల, ఈరోజు ఆలోచనలతో సతమతమవుతూ, ఏదో చెప్పాలన్న ఆరాటానికి, ఎలా చెప్పాలన్న సంశ యానికి మధ్య నలిగిపోతున్నట్లు కనపడడం చూసి ఆయన అనేకవిధాల అడిగి, కాసేపటికి అసలు సంగతి రాబట్టగలిగారు. సంగతి విన్నాక తేలిగ్గా నవ్వేశారు.

"ఏం, అప్పుడే పిల్లలమీదికి పోతూందా మనసు? పెంచుకోడమెందుకు? నీకు పుట్టరనేనా?"


"అదేం కాదు! ఎందుకో ఆ పాప నాకు చాలా నచ్చింది. చాలా ముద్దుగా ఉంది. మనకి కాస్త కాలక్షేపం అవుతుందని..." నసిగింది శ్యామల.

"బాగానే ఉందనుకో! పెంచుకోడం అంటే మాటలా? ఎందుకు వచ్చిన గొడవ చెప్పు! రేపు మనకి పిల్లలు పుడితే ఈ పిల్లనేం చేస్తాం? బాగా ఆలోచించు. అనవసరంగా సమస్యలు నెత్తికి తెచ్చు కోడం ఎందుకు?"

"ఆలోచించడానికి ఏముంది? మనకి పిల్లలు పుడితే ఆ పిల్లలతోపాటు పెరగకూడదా, ఉష? ఆ ఒక్కపిల్ల మనకి బరువా, ఇంట్లో ఇంతమంది ఉండగా?"

"సరే, నీకంత ముచ్చటగా ఉంటే నాకేం అభ్యం తరం లేదుగాని ... అయినా అంతమంది ఉండగా ఆ పాపమీదనే నీకెందు కంత మక్కువ?"

శ్యామల ముఖం ఒక్కసారి పాలిపోయినట్లు తెల్ల బడింది. గొంతు తడబడి వణికింది.





"చెప్పానుగా, అందరికంటే ఆ పిల్లే ముద్దువస్తోంది. ఎందుకో అంత చక్కటి పాప అలా అనాథగా పెరుగుతూంటే నాకేమిటో కష్టంగా ఉంది!"

శ్యామలవైపు ఒక్క క్షణం విచిత్రంగా చూశారు రంగారావు. ఆమె దయార్ద్ర హృదయానికి మెచ్చుకుంటున్నట్టు ప్రేమగా నవ్వి, "నీ ఇష్టం కాదంటానా? అలాగే రేపు వెళ్ళి ఉషని తీసుకువస్తాం" అన్నారు.

ఉష వచ్చిన దగ్గరనించి శ్యామలకు బాగా కాలక్షేపం కాసాగింది. ఆమె ఆటపాటలతో, ముద్దుముచ్చటలతో రకరకాల బట్టలు తొడగడం, ముస్తాబు చేయడం, బొమ్మలతో ఆడుకోడం వగైరాలతో తీరిక చిక్కనంత కాలక్షేపం కాసాగింది. మొదట రెండుమూడు రోజులు కొత్త చేసినా, క్రమంగా శ్యామల ప్రేమాభిమానాలతో శ్యామలకు చేరువయి 'అమ్మా' అని పిలిచేది ఉష.

రంగారావుకూడా ఉషను చూసి ఎంతో ముచ్చటపడ్డారు. మామూలుగా కనపడని కళాకాంతులు ఆ పిల్ల ముఖంలో చూసి ఆశ్చర్యపడ్డారు. చాలారోజుల తరవాత ఇంట్లో పసిపిల్ల ఆటపాటలు ఆయన్ని ఎంతో సంతోషపరిచాయి. ఉషను చూస్తూంటే ఆయన కేదో అనుభూతి కలిగి, ఆయన మనసులో ఏదో అనుబంధం ఏర్పడింది.

* * * *

ఆరోజు అనుకోకుండా ఊరునించి ముందుగా వచ్చిన రంగారావుగారికి డ్రాయింగు రూములోంచి కొంచెం గట్టిగా మాటలు వినపడ్డాయి. అందులో ఒక గొంతు అపరిచిత పురుషకంఠం. రెండోది శ్యామలది.

"నిజం జమీందారుగారికి తెలిస్తే మీ ఇద్దరి గతి, పాప భవిష్యత్తు ఏమవుతుందో తెలుసా? మర్యాదగా నే నడిగింది ఇచ్చేస్తే ఈ రహస్యం బయటికి పొక్కదు."

"ఇప్పటికే రెండుసార్లు అయింది. ఇలా ఇస్తున్నంత కాలం నువ్వు మళ్ళీ రాకుండా ఉంటావని నమ్మకమేమిటి?"

"ఇంక రాను. మాట ఇస్తున్నాను."

"నువ్వింత దుర్మార్గుడవని అనుకోలేదు. నన్నెందుకిలా పీడిస్తావు? నీకు నేనేం అపకారం చేశాను? పాప మీద నీకెందు కంత పగ?"

ఆ మాటలు వింటూనే లోపలికి అడుగుపెట్టారు రంగారావు. ఆయన్ని అలా అనుకోకుండా హఠాత్తుగా చూసిన ఇద్దరూ నిశ్చేష్టులైపోయారు. శ్యామల వివర్ణమయిన ముఖం చేతుల్లో దాచుకుంది.

"ఏమిటిది? ఏమిటా రహస్యం?" తుపాను ముందు ప్రశాంతిలా నిశ్చలంగా చూస్తూ శాంతంగా అడిగా రాయన.

ఆతను శ్యామలవంక, ఆయనవంక చూసి చెప్పటానికి తటపటాయించి పారిపోబోయాడు.

"అడుగు కదిలావంటే నరికేస్తాను. ఆ రహస్యమేమిటో చెప్పు!" జమీందారుగారు గుమ్మానికి అడ్డంగా నిలబడి గంభీరంగా అడిగారు.

"ఉష అనాథ కాదు, ఆవిడకి తెలుసు. గట్టిగా అడగండి, ఆమే చెబుతుంది!" అంటూనే ఆయన పక్కనించి దూసుకుపోయాడు. ఆయన ఈ వార్త విని తిరిగి చూసేసరికి హాల్లో ఎవరూ లేరు.

రాబోయే తుపానును ఊహించి శ్యామల ఆ సాయంకాలంవరకు ఆయని నించి ముఖం చాటుచేసుకు తిరిగింది. ఆయన కోపం విజృంభిస్తే తను తట్టుకుని నిలబడడం కష్టం. ముసలావిడ కాలంచేశాక ఇంట్లో ఆయన్ని అడ్డుకోగలవారెవరూ లేరు.

ఆ రాత్రి బాగా పొద్దుపోయాక ఆయన పడుకున్నారన్న నమ్మకంతో గదిలో ప్రవేశించింది శ్యామల. గది అంతా చీకటిగా ఉంది. మెల్లిగా నడిచి మంచం చేరేంతలో లైటు వెలిగింది. ఆమె బిత్తరపోయింది.

"నీకోసమే చూస్తున్నాను, ఇంత ఆలస్యం చేశావేం?" ఆయన గొంతు చాలా ప్రశాంతంగా ఉంది. సోఫాలో కూర్చుని ఉన్నారు.

"ఉషని పడుకోబెడుతున్నాను."

"రా, ఇలా వచ్చి కూర్చో!" సోఫాలో జరిగి చోటు ఇచ్చారు ఆయన. ఆమె ఊహించిన కోపావేశాలకు బదులు ఈ శాంతం, సౌమ్యత ఆమెనింకా ఎక్కువగా కాలుస్తున్నాయి బెదురుతూ, అలజడితో ఒక వారగా ఒదిగి కూర్చుంది.

"నువ్వు అందమైనదానివి, తెలివైనదానివి అన్న సంగతి తప్పించి, నీ గురించిగాని, నీ పుట్టుపూర్వోత్తరాలను గురించిగాని నాకేం తెలియదు. తెలుసుకోవాలని ప్రయత్నమూ చెయ్యలేదు. అయినా నీలో నమ్మకం ఉంచి, నీ ప్రవర్తనమీది విశ్వాసంతో నిన్ను పెళ్ళాడాను. నా ఎడ నీకింక ఎలాంటి భావమున్నా లేకపోయినా, కేవలం మానవధర్మంగా నేనుంచిన నమ్మకానికి, విశ్వాసానికి బదులివ్వాలి నువ్వు. అవునంటావా?"

> చెడు పుస్తకానికి మించిన దొంగ లేడు.
> —ఇటాలియన్ సామెత
>
> * * *
>
> స్నేహం చేయడానికి మనిషిని ఎన్నుకొన్నట్టుగా చదవడానికి పుస్తకాన్ని ఎన్నుకోండి.
> —రాస్కామన్

అతి మన్నితంగా, మెత్తగా మొదలైన ఈ సంభాషణ ఎక్కడికి దారి తీస్తుందో అన్న భయంతో వణికింది శ్యామల.

"ఉష ఎవరు?"

శ్యామల మాట్లాడలేకపోయింది.

"ఇప్పుడింక మాటలు మింగి ప్రయోజనం లేదు. రహస్యం దాచి ప్రయోజనం లేదు. నేనేదో ఒక నిర్ణయానికి వచ్చేలోపల నువ్వు చెప్పదలుచుకున్నదేదో చెప్పడం మంచిది. ఆ తరవాత విచారించినా ప్రయోజనం ఉండదు."

శ్యామల కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. తల దించుకుంది.

"ఉష ఎవరో నీకు తెలుసన్న సంగతి తెలుస్తూనే ఉంది. మధ్యాహ్నం జరిగింది చూశాక, విన్నాక ఏమాత్రం బుద్ధి ఉన్నవాడికన్నా ఇంచుమించు కథ అర్థం అవుతుంది. ఇంక ఇప్పుడు నేను వినగోరేది, అది ఎవరికి పుట్టిందని?"

శ్యామల ఒక్కసారి తలెత్తి చురుకుగా చూసింది. కళ్ళు నీటిపొరలతో మెరిశాయి.

"మీరు ఊహించింది సరిగాదు. పొరపాటు పడుతున్నారు."

"పొరపాటు ఇప్పుడు పడడమేం? నిన్ను పెళ్ళాడినప్పుడే పొరపడ్డాను. ముఖాన్ని, మాటలను చూసి మోసపోయాను! నీ అందంలాగే నీ మనసు, నీ గతం నిర్మలమైనవి అనుకోడం పొరపాటుగదూ? మట్టిలో అణిగిపోయిన వజ్రానివే అనుకున్నానుగాని, నీ నిజరూపం బొగ్గని మరిచిపోవడం పొరపాటుగదూ! కానీలే, అయిపోయినదానికి బాధపడే మనిషిని గాదు నేను." పరిస్థితి క్రమంగా మారుతూంది. రంగారావు గొంతు కఠినం, తీవ్రం అవుతూంది.

"మీరు నన్ను అర్థం చేసుకోండి. ఇందులో నన్ను శంకించడానికి ఏం లేదు. నే నేపాపం ఎరగను. నామాట నమ్మండి."

"ఉష ఎవరు? రోడ్లంట తిరిగే ఆ రౌడి కూతురేనా? ఈ రహస్యం దాగడానికి ఇంతవరకు ఎంత డబ్బు తగలేశావు?"

"ఉష ఎవరో చెప్పలేను. దయచేసి ఆ సంగతి అడక్కండి. చెప్పలేను. మీనించి దాచాలని కాదు. కాని చెప్పగల శక్తి నాకు లేదు. నిజం చెబుతున్నాను, ఉషకి వాస్తవంగా తల్లి తండ్రి లేరు. అతడెవడో నా కసలు తెలియదు, ఉష మనింటికి వచ్చిందాకా!"

"వాడెవడో తెలియకుండానే రెండుసార్లు డబ్బిచ్చావన్నమాట. శ్యామలా, ఇంకా ఎందుకు నన్ను నమ్మించచూస్తావు? ఎందుకు నన్నింకా వంచించ చూస్తావు?"

"దయచేసి నన్నర్థం చేసుకోండి. తొందరపడకండి. దైవసాక్షిగా చెబుతున్నాను, అతనికి నాకు ఏ సంబంధం లేదు."

"అయితే ఉష ఎవరో చెప్పు!"

శ్యామల మౌనంగా తల దించుకుంది.

"సరే!" ఇంక మాట్లాడవలసింది ఏం లేదన్నట్టు రంగారావు లైటార్పి మంచంమీద పడుకున్నారు.

మరునాడు శ్యామల లేచేసరికి ఆయన లేవలేదు. ఓ గంట పోయాక మళ్ళీ వచ్చేసరికి, బట్టలు వేసుకుని ప్రయాణానికి సిద్ధం అవుతున్నారు. మంచంమీద బెడ్డింగు, సూట్కేసు తయారుగా ఉన్నాయి.

శ్యామల మనసు పరిపరివిధాల పోయింది. ఆవేదన, ఆరాటం గుండెల్లో అలజడి రేకెత్తిస్తూంటే బెరుగ్గా, బాధగా అడిగింది: "ఇంత అకస్మాత్తుగా ఎక్కడికీ ప్రయాణం?"

రంగారావు మాట్లాడలేదు. ఆయన చూపుల్లో నిశ్చలత, ఒకవిధమైన స్థిరత్వం చూసి శ్యామలకు సగం సంగతి అర్థం అయింది.

"శ్యామలా!" రంగారావు గొంతుదృఢంగావినపడింది. "నిన్న ఈ సంఘటన జరిగినప్పటినించి నేను ఒక్కటే విషయం ఆలోచిస్తున్నాను, ఈ అవమానానికి పరిష్కారం ఏమిటని. ఇది నా ఒక్కడికే కాదు, మొత్తం ఈ వంశానికే ఘోరావమానం! ఇంత జరిగాక మనిద్దరి మధ్య ఇంక పాత భావాలకు చోటు ఉండదు.

